1 St
Happy Work Anniversary.
Year

షణ్ముఖ
RNI : APTEL / 2023 / 89152
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 110
ఆదివారం 26 ఏప్రిల్ 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నివాసంలో సిట్ సోదాలు... అక్కడే విచారణ!

**ఏపీ మద్యం రవాణా స్కామ్ కేసులో మాజీ మంత్రి కారుమూరి విచారణ**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 25)

మిథున్ రెడ్డికి చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్టు సంస్థలో ఈడీ సోదాలు

ఏపీ లిక్కర్ రవాణా ఆరోపణలకు సంబంధించిన కేసులో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఈ కేసులో భాగంగా శనివారం హైదరాబాద్‌లో వైసీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నివాసంలో సిట్ సోదాలు నిర్వహించింది. జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలోనే సిట్ అధికారులు విచారణ కూడా చేపట్టారు.


జూబ్లీహిల్స్‌లోని కారుమూరి నివాసంలో సిట్ అధికారులు ఆయనను సుమారు నాలుగు గంటల పాటు ప్రశ్నించి, స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ▶మిగతా 2లో

## ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ పర్యటన ఖరారు

**మే 9న తెలంగాణకు రానున్న ప్రధాని మోదీ**

**పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న మోదీ**

**పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభ**



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 25)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెలలో తెలంగాణలో పర్యటించనున్నారు. మే 9వ తేదీన ఆయన రాష్ట్రానికి రానున్నారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర పర్యటన ఖరారైంది. పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటారు. హైదరాబాద్ నగరంలోని పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయ్యాక తెలంగాణకు రావడం ఇదే మొదటిసారి.

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన తెలంగాణకు వస్తారు. తెలంగాణ పర్యటనలో భాగంగా ఎంఎంటీఎస్ ఫేజ్-2ను ▶మిగతా 2లో

## ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవు: ఎమ్మెల్యే పార్థసారథి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 25)

ఆదోని నియోజకవర్గంలో అక్రమించుకున్న ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని, ప్రజల అవసరాలకు వినియోగిస్తామని ఎమ్మెల్యే డా. పార్థసారథి తెలిపారు. శుక్రవారం సాయంత్రం పట్టణ శివారులోని కల్లుబావితో పాటు మండగిరి పంచాయతీ పరిధిలో సర్వే సంఖ్య 430, 574లో అక్రమణలకు గురి అయ్యాయని భావిస్తోన్న భూములను ఇన్‌ఛార్జ్ సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారన్నారు. వీటిని స్వాధీనం చేసుకుంటే చిన్న తరహా పరిశ్రమలకు ఉపయుక్తంగా మారి, ఉపాది అవకాశాలు పెంచేందుకు దోహదపడుతుందన్నారు. వీటినిపై ప్రభుత్వానికి నివేదిస్తానన్నారు. విచారణ చేసి, ప్రభుత్వ భూములైతే తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. రెండోసారి పరిశీలన చేస్తున్నామని.. ఈ రోజు 30 ఎకరాల వరకు భూమిని గుర్తించామన్నారు. వీరికి నోటీసులు జారీ చేసి, పరిశీలన చేస్తామని ఇన్‌ఛార్జ్ సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ భూముల సంరక్షణకు గట్టి చర్యలు తీసుకుంటానున్నారు.

# నాకు మరో అవకాశం దక్కడం నా అదృష్టం

## ముంబైలో సీఎం చంద్రబాబు

**ముంబైలో 'బెస్ట్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్-2025' అవార్డు అందుకున్న సీఎం చంద్రబాబు**

**సైబరాబాద్ తర్వాత అమరావతి రూపంలో మరో నగరాన్ని నిర్మించే అవకాశం దక్కిందని వెల్లడి**


**హైదరాబాద్‌ను మించిన నగరంగా, ఫ్యూచర్ సిటీగా అమరావతిని తీర్చిదిద్దుతామని స్పష్టీకరణ**

**మోదీ ఒక రిఫార్మర్, పెర్ఫార్మర్, విన్నర్ అని ప్రశంస**

**గ్రీన్ ఎనర్జీ, ఏఐ, జనాభా నిర్వహణ వంటి భవిష్యత్ ప్రణాళికలను వివరించిన చంద్రబాబు**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 25)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైబరాబాద్‌ను నిర్మించి దేశానికి ఒక టెక్నాలజీ రాజధానిని అందించిన తనకు, రాష్ట్ర విభజన అనంతరం అమరావతి రూపంలో మరో నగరాన్ని నిర్మించే అద్భుతమైన అవకాశం దక్కిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇది తన అదృష్టంగా భావిస్తున్నానని, అమరావతిని కేవలం ఒక రాజధానిగా కాకుండా, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచే 'ఫ్యూచర్ సిటీ'గా తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు.ముంబైలో ప్రతిష్ఠాత్మక 'ఎకనమిక్ టైమ్స్' సంస్థ నిర్వహించిన ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా 'బెస్ట్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్-2025' అవార్డును ఆయన అందుకున్నారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ, సంస్కరణలు, అభివృద్ధి, సంక్షేమంపై తన దార్శనికతను ఆవిష్కరించారు. ▶మిగతా 2లో



## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు అంగీకరించాం: మంత్రి పొన్నం ప్రభాకర్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 25)

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సహా పలు డిమాండ్లకు తమ ప్రభుత్వం అంగీకరించిందని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు , అధికార ప్రతినిధులతో ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెండు రోజుల సమ్మెలోనే పలుమార్లు కార్మికులతో చర్చలు జరిపినట్లు తెలిపారు.

వారి చిరకాల స్వప్నమైన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాల ఎన్నికలు, 11 శాతం పీఆర్సీ ప్రకటన పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ప్రభుత్వం డిమాండ్లకు అంగీకరించడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మంత్రుల బృందం సుమారు 15 గంటలు చర్చించి వారి సమస్యలను పరిష్కరించి, సమ్మెను విరమింపజేశారని అన్నారు.

ఆర్టీసీ కార్మికుల అంశాలపై ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కేడర్ సంబరాలు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించిందని అన్నారు. ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల ఎన్నికల నిర్వహణ, ▶మిగతా 2లో

## ఏపీలోని పలు జిల్లాల్లో పెట్రోల్, డీజిల్ కొరత.. రంగంలోకి దిగిన చంద్రబాబు!

**ఉమ్మడి గోదావరి, కర్నూలు, నంద్యాల వంటి జిల్లాల్లో పెట్రోల్ కొరత**


**ఇబ్బంది పడుతున్న వాహనదారులు, రైతులు**

**సమస్యను వెంటనే పరిష్కరించాలని సీఎస్, పౌర సరఫరా అధికారులకు సీఎం ఆదేశం**

**పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తో మాట్లాడిన సీఎం**

**ఆయిల్ కంపెనీలు, పెట్రోల్ బంకుల యజమానులతో మాట్లాడాలని అధికారులకు సూచన**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 25)



రాష్ట్రంలోని ఉమ్మడి గోదావరి, కర్నూలు, నంద్యాల వంటి జిల్లాల్లో పెట్రోల్ బంకులు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తుండటంతో వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబు అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించి, కీలక ఆదేశాలు జారీ చేశారు. వరి కోతల సమయంలో డీజిల్ దొరక్కపోవడంతో యంత్రాలు పొలాల్లోనే నిలిచిపోయాయి. అటు ఆక్వా రైతులు కూడా ఏరియేటర్ల నిర్వహణకు డీజిల్ లేక తీవ్ర ఆందోళనలో ఉన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిణామాల వల్ల అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరగడంతో ఆయిల్ కంపెనీలు సరఫరాను నియంత్రించాయి. దీనికి తోడు కంపెనీలు ▶మిగతా 2లో

## ఎన్ని పార్టీలు వచ్చినా.. భాజపాకు ఇబ్బంది లేదు రామచందర్‌రావు


(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 25)



రాష్ట్రంలో ఎన్ని పార్టీలు ఉన్నా.. ఎన్ని కొత్త పార్టీలు వచ్చినా.. భాజపాకు ఇబ్బంది లేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. తెలంగాణలో భాజపాకు మంచి వాతావరణం ఉందని పేర్కొన్నారు. 12 ఏళ్లుగా నరేంద్ర మోదీ అవినీతి రహిత పాలన అందిస్తున్నారని కొనియాడారు. కవిత కొత్త పార్టీ పెట్టడంపై రామచందర్‌రావు స్పందించారు. భాజపా కార్యాలయంలో పండిట్ దీన్‌దయాల్ ప్రశిక్షణ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శిక్షణ తరగతుల్లో పార్టీ బలోపేతం, సిద్ధాంతాలను కార్యకర్తలకు వివరించారు.

## విశ్వగురువుగా భారత్ అవతరిస్తుంది

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 25)



భారత్ కచ్చితంగా విశ్వ గురువుగా అవతరించి ప్రపంచానికి మార్గదర్శకత్వం చేస్తుందని, భవిష్యత్తుపై ఎవరూ ఎటువంటి సందేహాలు పెట్టుకోవద్దని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆరెస్సెస్) అధ్యక్షుడు మోహన్ భాగవత్ వ్యాఖ్యానించారు. నాగ్‌పుర్ శివారులోని జామ్తా ప్రాంతంలో ఉన్న నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో 'భారత్ దుర్గా శక్తి స్థల్' ఆలయ నిర్మాణానికి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. "నిరంతర ప్రయత్నాలు, సామూహిక క్రమశిక్షణ ద్వారా విశ్వగురువు కావాలనే భారత్ కల సాకారమవుతుంది. ప్రస్తుత తరంలో అటువంటి ప్రవర్తన చూడొచ్చు. భవిష్యత్తుపై సందేహాలు వదిలి ధైర్యం, ఆత్మనిర్భరతతో జీవించండి. వీటిని రోజువారి జీవితంలో ఆచరిస్తే ▶మిగతా 2లో

## జూన్ నాటికి అనకాపల్లి వరకు పోలవరం జలాలు: నిమ్మల రామానాయుడు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 25)



ఉత్తరాంధ్ర జిల్లాల సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలను తీర్చడంలో గోదావరి జలాలు అత్యంత కీలకమని, ఈ నీటిని తరలించేందుకు పోలవరం ఎడమ కాలువే ప్రధాన ఆధారమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. జూన్ నాటికి మొదటి దశ పనులను పూర్తి చేసి, అనకాపల్లి వరకు గోదావరి జలాలను తరలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. కాకినాడ జిల్లా అన్నవరంలో పంపా ఆక్విడక్ట్ వద్ద పోలవరం ▶మిగతా 2లో

మొదటిపేజీ తరువాయి

# నాకు మరో అవకాశం దక్కడం నా అదృష్టం

**హైదరాబాద్‌ను మించిన నగరంగా అమరావతి**

"రాష్ట్ర విభజన తర్వాత నాకు అమరావతి రాజధాని నిర్మాణం ద్వారా మరో నగరాన్ని నిర్మించే అవకాశం వచ్చింది. గతంలో సైబరాబాద్ నిర్మాణంతో దేశానికి ఒక టెక్నాలజీ క్యాపిటల్‌ను ఇవ్వగలిగాం. ఇప్పుడు అమరావతిని అంతకుమించి తీర్చిదిద్దాలన్నదే నా లక్ష్యం. ఇది కేవలం ఇటుకలు, కాంక్రీటుతో కట్టే నగరం కాదు. గ్రీన్, బ్లూ సిటీగా, నెట్-జీరో కార్బన్ కాన్సెప్టుతో పర్యావరణ హితంగా నిర్మిస్తున్నాం. హైదరాబాద్ కంటే మెరుగైన, అన్ని హంగులున్న 'హైదరాబాద్ ప్లస్' నగరంగా అమరావతి చరిత్రలో నిలిచిపోతుంది" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

ఈ అవార్డు ద్వారా రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వస్తాయని ఆశిస్తున్నానని, పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఈ వేదికగా పిలుపునిచ్చారు.

**సంస్కరణలతోనే సంపద సృష్టి**

నాలున్నర దశాబ్దాల తన రాజకీయ జీవితంలో సంస్కరణలకు ముందు, తర్వాత భారతదేశాన్ని క్షుణ్ణంగా చూశానని చంద్రబాబు తెలిపారు. "సంపద సృష్టికి సంస్కరణలే పునాది. సంస్కరణలు అమలు చేస్తేనే అభివృద్ధి సాధ్యం, ఆ అభివృద్ధి ఫలాలను సంక్షేమ రూపంలో ప్రజలకు అందించగలం. 1990లలో వచ్చిన ఐటీ విప్లవాన్ని అందిపుచ్చుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విజన్ 2020 అమలు చేశాం. దాని ఫలాలనే హైదరాబాద్ ఇప్పుడు అనుభవిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పుడు '2047 వికసిత్ భారత్' లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండాలన్నదే నా ఆకాంక్ష. ప్రధాని మోదీ ఒక అత్యుత్తమ రిఫార్మర్, పెర్ఫార్మర్, విన్నర్. ఆయన నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో దూసుకెళ్తోంది" అని చంద్రబాబు ప్రశంసించారు.

**గ్రీన్ ఎనర్జీ, ఏఐతో నవశకం**

భవిష్యత్తు గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)దేనని చంద్రబాబు అన్నారు. "గతంలో విద్యుత్ సంస్కరణలతో మిగులు విద్యుత్ సాధించాం. ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ, బ్యాటరీ స్టోరేజ్, గ్రీన్ అమ్మోనియా వంటి రంగాలపై దృష్టి పెట్టాం. ప్రధాని 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యం పెడితే, అందులో ఏపీ 160 గిగావాట్ల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే 90 గిగావాట్ల దిశగా అడుగులు వేశాం. త్వరలోనే విద్యుత్‌ను ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతాం," అని తెలిపారు. ఏఐ టెక్నాలజీని పాలనలో భాగం చేస్తూ ఏఐ డాక్టర్, ఏఐ ట్యూటర్ వంటి సేవలు అందిస్తున్నామన్నారు. విశాఖలో గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుందని, ఈ నెల 28న దానికి శంకుస్థాపన చేయబోతున్నామని వెల్లడించారు.

**అభివృద్ధితో పాటే సంక్షేమం**

అభివృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు కూడా చేరాలని చంద్రబాబు అన్నారు. "మన సమాజం కేవలం మిలియనీర్లు, బిలియనీర్ల కోసం మాత్రమే కాదు, సామాన్యులది కూడా. అందుకే 'పీ4' (ప్రజలు, పేదలు, భాగస్వామ్యం, ప్రగతి) కార్యక్రమాన్ని రూపొందించాం. సమాజంలో 10 శాతం ఉన్న ధనవంతులు, 20 శాతం ఉన్న పేదలను ఆదుకునేలా 'ఎంబీకే 10-20' ఫార్ములాను తీసుకొచ్చాం. సంపన్నులు మార్గదర్శకులుగా మారి పేదలను చేయూతనివ్వాలి," అని ఆయన పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై మాట్లాడుతూ, మహిళలు సంకల్పిస్తే ఈ బిల్లు తప్పకుండా అమలవుతుందని, దీనికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

**భవిష్యత్తు కోసం జనాభా నిర్వహణ**

దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఒక వినూత్నమైన ఆలోచనను చంద్రబాబు పంచుకున్నారు. "మూడు దశాబ్దాల క్రితం జనాభా నియంత్రణను బలంగా అమలు చేశాం. కానీ భవిష్యత్తులో మన దేశం జనాభా కొరతను ఎదుర్కోనుంది. డబ్బుంటే పరిశ్రమలు పెట్టొచ్చు, కానీ జనాభాను సృష్టించలేం. ప్రస్తుతం భారత్ ఫెర్టిలిటీ రేటు 1.9 ఉండగా, ఏపీలో అది 1.5 మాత్రమే. అందుకే, ముందుచూపుతో 'పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ'ని తీసుకురావాలని నిర్ణయించాం. భవిష్యత్తులో జనాభా ఉన్న దేశాలే సంపన్న దేశాలుగా నిలుస్తాయి," అని చంద్రబాబు తన దూరదృష్టిని వివరించారు.

## ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ పర్యటన ఖరారు

ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. బీబీనగర్ ఎయిమ్స్ హాస్పిటల్‌ను జాతికి అంకితం చేసే అవకాశముంది. రాష్ట్రంలో పలు జాతీయ రహదారులకు శంకుస్థాపన చేసే అవకాశముంది. కాగా, మల్లారెడ్డి యూనివర్సిటీలో నిర్వహించే కార్యక్రమానికి ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి హాజరవుతారా లేదా తెలియాల్సి ఉంది.

## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు అంగీకరించాం: మంత్రి పొన్నం ప్రభాకర్

ఉద్యోగులకు 11 శాతం పీఆర్సీ ప్రకటనతో పాటు మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో కార్మికులు 55 రోజుల పాటు సమ్మె చేస్తే గత ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఆ రోజు సమ్మె సమయంలో 30 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వానికి శత్రుత్వం ఉండదని, వారు కూడా కుటుంబ సభ్యులే అన్నారు. ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ వ్యవహరించిన తీరు సరికాదని అన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ శవరాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో మనం ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగ నియామకాలు, కారుణ్య నియామకాలు, సర్వీసు నుంచి తొలగించిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవడం జరిగిందని అన్నారు. రోజుకు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణం చేస్తున్నారని తెలిపారు.

## ఏపీలోని పలు జిల్లాల్లో పెట్రోల్, డీజిల్ కొరత.. రంగంలోకి దిగిన చంద్రబాబు!

క్రెడిట్ ఆప్షన్‌ను రద్దు చేయడం, పాత బకాయిలు ఉన్న బంకులకు స్టాక్ నిలిపివేయడం ఈ సంక్షోభానికి ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. పెట్రోల్, డీజిల్ సమస్య తీవ్రతరం అవుతుండటంతో, సీఎం చంద్రబాబు రంగంలోకి దిగారు. సమస్యను తక్షణం పరిష్కరించాలని సీఎస్, పౌరసరఫరాల అధికారులను సీఎం ఆదేశించారు. పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తో కూడా మాట్లాడారు. స్టాకు లేని బంకుల వివరాలను వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ కంపెనీలు, పెట్రోల్ బంకుల యజమానులతో మాట్లాడాలని సూచించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని, వినియోగదారులు ఇబ్బంది పడకుండా చూసుకోవాలని చెప్పారు. మరోవైపు, పెట్రోల్ స్టాక్ సమస్య ఉంటే వెంటనే ఆ బంక్ వారు 1967 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేయాలని కమిషనర్ సూచించారు.

## జూన్ నాటికి అనకాపల్లి వరకు పోలవరం జలాలు: నిమ్మల రామానాయుడు

ఎడమ ప్రధాన కాలువ పనులను మంత్రి ఈరోజు స్వయంగా పరిశీలించారు. ఆరెంపూడి, గవరయ్య కోనేరు గ్రామాల సమీపంలో నేషనల్ హైవే క్రాసింగ్ వద్ద జరుగుతున్న వంతెనల నిర్మాణ పనులను పర్యవేక్షించిన ఆయన, అనంతరం తుని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పనుల్లో జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదని ఏజెన్సీలను హెచ్చరించారు. ముఖ్యంగా హైవే క్రాసింగ్ వద్ద వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనకాపల్లి కేంద్రంగా వస్తున్న భారీ పరిశ్రమలకు నీటి ఎద్దడి లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరం ఎడమ కాలువ కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మంత్రి ఆరోపించారు. జగన్ ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రజలపై కక్ష గట్టి పనులను ప్రీ-క్లోజర్ చేసిందని, కాలువ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కుల నుంచి 8,122 క్యూసెక్కులకు తగ్గించి ప్రాంతీయ ప్రయోజనాలకు గండికొట్టారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు మొదటి ప్రాధాన్యతగా పోలవరం ప్రాజెక్టును, రెండో ప్రాధాన్యతగా ఈ ఎడమ కాలువను సందర్శించారని గుర్తుచేశారు.

ప్రస్తుతం రూ.1,460 కోట్లు ఖర్చు చేసి పనులను పరుగులు పెట్టిస్తున్నామని, ఇప్పటివరకు 76 శాతం పనులు పూర్తయ్యాయని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా తుని వరకు ఉన్న 110 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నిండటం వల్ల 28,557 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. పిఠాపురం అప్ టేక్ స్లూయిస్ నిర్మాణం పూర్తయితే మరో 67,674 ఎకరాల ఏలేరు ఆయకట్టుకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. మార్గమధ్యంలో ఉన్న 143 గ్రామాలకు చెందిన 5.23 లక్షల మందికి శాశ్వతంగా తాగునీటి సమస్య తీరుతుందన్నారు. అలాగే పాయకారావుపేట ఎగువన ఉన్న 98 ట్యాంకులు నిండటం ద్వారా 48,368 ఎకరాలకు నీరందుతుందని పేర్కొన్నారు. కుమ్మరిలోవ నిర్వాసితులకు రూ.30.38 కోట్ల పరిహారాన్ని అందించినట్లు వెల్లడించిన మంత్రి, ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు.

## విశ్వగురువుగా భారత్ అవతరిస్తుంది

భారత్ బలపడి ప్రపంచానికి మార్గనిర్దేశం చేస్తుంది. అయోధ్యలో రామ మందిర నిర్మాణంపై కూడా ప్రజలు మొదట సందేహించారు. తర్వాత దాని నిర్మాణం పూర్తయింది. పాశ్చాత్య ఆలోచనా విధానాలను వీడి, ఆలోచన, ప్రవర్తనలో భారతీయ సంప్రదాయాలతో తిరిగి మమేకం కావాలి" అని భాగవత్ పిలుపునిచ్చారు.

## మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నివాసంలో సిట్ సోదాలు... అక్కడే విచారణ!

ఆయన వయసు 60 ఏళ్లు పైబడటంతో, చట్ట ప్రకారం ఆయన కోరిన చోటనే విచారణ జరిపినట్లు సిట్ అధికారులు తెలిపారు. విచారణకు కారుమూరి పూర్తిగా సహకరించారని, అవసరమైతే మరోసారి విచారిస్తామని వెల్లడించారు. మద్యం రవాణా టెండర్లు, సబ్ కాంట్రాక్టులలో అవకతవకలు జరిపి ప్రభుత్వ ఖజానాకు రూ.200 నుంచి రూ.250 కోట్ల వరకు నష్టం కలిగించారనే ఆరోపణలపై సిట్ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో కారుమూరితో పాటు ఆయన కుమారుడు సునీల్‌పై కూడా కేసు నమోదైంది. అయితే, అనారోగ్య కారణాల రీత్యా విచారణకు హాజరుకాలేనని సునీల్ సమయం కోరినట్లు అధికారులు తెలిపారు. ఇక, ఇదే సమయంలో ఈడీ అధికారులు ఎంపీ మిథున్ రెడ్డికి చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్టు సంస్థ కార్యాలయంలో సోదాలు నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఒకేరోజు రెండు ఏజెన్సీలు వేర్వేరు చోట్ల సోదాలు, విచారణ చేపట్టడంతో ఈ కేసులో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఈ దర్యాప్తుతో కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## స్వర్ణాంధ్రే లక్ష్య సాధనగా ప్రణాళికలు రూపొందించాలి

### అధికారులకు జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 25)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయానికి అనుగుణంగా 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్యసాధన దిశగా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్లో స్వర్ణాంధ్ర విజన్ పై మార్కాపురం జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నిర్దేశిత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని లక్ష్యసాధనకు ఆచరించాల్సిన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. వచ్చే నెలకు సంబంధించి నెలవారి టార్గెట్ ను ఈనెల 27వ తేది లోపు నిర్ణయించి తన వద్ద అప్రూవల్ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ప్రతి నెల 5వ తేదీ నాటికి ఆ నెల సాధించిన పురోగతిని ఆన్లైన్లో పొందుపరచాలన్నారు. పేదరిక లేని సమాజం, ఉపాధి కల్పన, నైపుణ్య అభివృద్ధి, నీటి భద్రత, టెక్నాలజీ వ్యవసాయం, అంతర్జాతీయ లాజిస్టిక్స్, ఇంధన వనరుల సమర్థవినియోగం లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు కనిగిరి ఆర్డీవో శివరామిరెడ్డి, సిపిఓ స్వరూపా రాణి, మైక్రో ఇరిగేషన్ పీడీ జెనెమ్మ, ఐసిడిఎస్ ఇంచార్జ్ పీడీ పద్మావతి, ఇతర అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.


## ఉచితంగా పశు వైద్యం



(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, ఏప్రిల్ 25)

ప్రపంచ పశు వైద్య దినోత్సవ సందర్భంగా మండలంలోని సోమేపల్లి పంచాయతీలోని గాంధీ నగర్‌లో శనివారం పశు వైద్యం ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి బాణాల రామయ్య, వెటర్నరీ డాక్టర్ సాంబశివరావు, రైతు నాయకులు మన్నే తిరపతయ్య, బంగారు నరసింహులు, నూర్జహాన్, సర్వజనమ్మ గ్రామంలో ఉన్న రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని పశువులకు ఉచిత వైద్యం చేయించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ కార్యదర్శి రామయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాడి మీద ఆధారపడ్డ రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఈ కార్యక్రమానికి బర్రెలు, గొర్రెలు, జంతువులకు సంబంధించి అనేక విషయాలు తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాలను గ్రామాలలో ఉపయోగించుకొని రైతుల అభివృద్ధి చెందాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరుపున కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు గ్రామ ప్రజలు, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వీయ గణనలో భాగంగా నేడు 5కే రన్ జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)

జనగణన 2027 'స్వీయ గణన' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 7.30 గంటలకు 5కే రన్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు శనివారం ఒక ప్రకటన తెలిపారు. ఈ 5కే రన్ ఒంగోలు కలెక్టరేట్ నుండి పాత జిల్లా పరిషత్ కార్యాలయం వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ 5కే రన్‌లో అన్నీ శాఖల అధికారులు, వారి కార్యాలయం సిబ్బంది, ప్రజలు పాల్గొని 5కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో జిల్లా కలెక్టర్ కోరారు.

## నేడు ఘనంగా అంకమ్మ తల్లి గుడి, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం

### హాజరుకానున్న మంత్రి రవికుమార్


(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఏప్రిల్ 25)

మండలంలోని అనమనమూరు గ్రామంలో ఆదివారం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అంకమ్మ తల్లి గుడి, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ఆర్భాటంగా జరగనున్నాయి. గత మూడు రోజుల నుంచి పూజా కార్యక్రమాలు జరుగుతుండగా చివరి రోజైన నేడు కనుల పండుగగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట జరగనుంది. ఈ సందర్భంగా సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు, యువ నాయకులు జంపు హరిబాబు మాట్లాడుతూ తమ దేవత అంకమ్మ తల్లి గుడి, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు పండగ వాతావరణం లో జరుగుతున్నట్లు చెప్పారు. గ్రామస్తులంతా కలిసి ఈ కార్యక్రమాన్ని వేడుకలా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొంటారని హరిబాబు తెలియజేశారు. అద్దంకి నియోజకవర్గం నలుమూలల నుండి వచ్చే భక్తులందరికీ సుమారు పదివేల మందికి పైగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాత్రికి విద్యుత్ కాంతులతో ప్రభ, కల్చరల్ ప్రోగ్రామ్స్ వంటివి ఉంటాయని జంపు హరిబాబు తెలియజేశారు. కావున భక్తులందరూ ఈ కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరుకుంటున్నట్లు హరిబాబు చెప్పారు.








ప్రకాశం

మార్కాపురం

బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
26.04.26 ఆదివారం


# ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడం లక్ష్యంగా పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత







**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 25)**

ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులకు సూచించారు. శనివారం మార్కాపురం కలెక్టరేట్లో డిఐఇపీసి పై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ విండో డెస్క్ పోర్టల్ ద్వారా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సమయం వరకు వేచి ఉండ కుండా త్వరితగతిన అన్ని అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. పిఎంఇజిపి పథకం ద్వారా పరిశ్రమలు నెలకొల్పడానికి దరఖాస్తు చేసిన వ్యక్తులకు వాటిని త్వరితగతిన పంపించాలన్నారు. మార్కాపురం జిల్లాలో రిలయన్స్, అతిరథ్ గ్రూప్ హెూల్డింగ్స్ వారు ఏర్పాటు చేస్తున్న సిబిజి ప్రాజెక్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అతిరథ్ గ్రూప్ హెూల్డింగ్స్ ల్యాండ్ ప్రొక్యూర్మెంట్ జిఎం రాధాకృష్ణ తమ సంస్థ యర్రగొండపాలెం నియోజకవర్గం త్రిపురాంతకం మండలంలో మూడు ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. సుమారు రూ.450 కోట్లతో 800 మందికి ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్కు వివరించారు. తమ ప్రాజెక్టుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ప్రాజెక్టులు ఏర్పాటు చేసే వారికి తమ పూర్తి సహకారం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా ఏపీ ఎన్జీఇఎల్, హరిత అమృత్ ఏర్పాటు చేస్తున్న సోలార్ పవర్ పురోగతి, ఎంఓయులు చేసుకున్న పరిశ్రమల పురోగతి పై చర్చించారు. జిల్లాలో పరిశ్రమలకు చెందిన వివిధ రాయితీలకు సంబంధించి 8 క్లయిమ్ లకు రూ. 4.34 కోట్ల ను మంజూరు చేశారు. ముందుగా అతిరథ్ గ్రూప్ హెూల్డింగ్స్ తరుపున ల్యాండ్ ప్రొక్యూర్మెంట్ జిఎం రాధాకృష్ణ జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీతకు పూల కుండీ అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి బి శ్రీనివాసరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్ మోహన్, నాబార్డ్ డీడీఎం రవికుమార్, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సింగరాయకొండ సీఐగా వై శ్రీహరి నియామకం

**(షణ్ముఖ వెలుగు, కొండపి, ఏప్రిల్ 25)**



ప్రకాశం జిల్లా సింగరాయకొండ పోలీస్ సర్కిల్కు నూతన సీఐగా వై శ్రీహరి నియమితులయ్యారు. గుంటూరు రేంజ్ ఐజీ ఆదేశాల మేరకు జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు గుంటూరు ఎస్బీ 3 సీఐగా విధులు నిర్వహించిన శ్రీహరి, తన సేవల ద్వారా మంచి అధికారిగా గుర్తింపు పొందారు. పోలీస్ విభాగంలో క్రమశిక్షణ, నిబద్ధతకు ప్రతీకగా నిలిచిన శ్రీహరి, ఎక్కడ పనిచేసినా ప్రజల మన్ననలు పొందుతూ, ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మార్కాపురం, కంభం, కొనకనమిట్ల, మద్రిపూడి, పొదిలి, పుల్లలచెరువు వంటి పలు పోలీస్ స్టేషన్లలో ఎస్ఐగా పనిచేసి విశేష అనుభవాన్ని సంపాదించారు. తర్వాత సీఐగా తొలి పోస్టింగ్ బాపట్లలో చేపట్టి అక్కడ సమర్థవంతమైన విధానంతో శాంతి భద్రతలను కాపాడటంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం గుంటూరు ఎస్బీ3 సీఐగా సుమారు 20 నెలల పాటు సేవలందించి, తన పనితీరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు సింగరాయకొండ సర్కిల్ బాధ్యతలు చేపట్టనున్న శ్రీహరి, తన అనుభవాన్ని వినియోగించి స్థానికంగా శాంతి భద్రతలను మరింత బలోపేతం చేస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ప్రజలకు చేరువగా ఉంటూ సమస్యలను పరిష్కరించే అధికారిగా ఆయన కొనసాగుతారని స్థానికులు ఆశిస్తున్నారు.

# అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రతిపాదినలు రూపొందించాలి

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు





(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, ఏప్రిల్ 25)

గ్రామస్థాయిలో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. ‘ పల్లెనిద్ర ’ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి చీమకుర్తి మండలం చంద్రపాలెం సచివాలయంలో నిద్రించిన ఆయన, శనివారం వేకువ జామునే ఆ గ్రామంలో పర్యటించారు. గ్రామంలో పారిశుద్ధ్యము, నీటి సరఫరా జరుగుతున్న తీరును ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్తో కలిసి పరిశీలించి స్థానికులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. గ్రామంలోని అభివృద్ధి కార్యక్రమాల గురించీ చర్చించారు. తమకు పెన్షన్లు రావడం లేదని స్థానికులు చెప్పగా, అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ పాఠశాలలో ఉన్న మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలించి, నీటిని క్లోరినేషన్ చేస్తున్న విధానంపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణ, క్లోరినేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యం ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. అనేక ఖనిజాలతో కూడిన ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఈ నీటినే తాగేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. స్థానిక చెరువును, మంచినీటి కోసం వేసిన డీప్ బోర్లను కూడా వారు పరిశీలించారు. నీటి లభ్యత పుష్కలంగా ఉన్నప్పటికీ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, మరో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ కావాలని స్థానికులు ఈ సందర్భంగా కలెక్టర్ను కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందిస్తూ అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను (తరువాయి 4లో...)

## మార్కాపురం సీఐగా ఎస్ కె అల్తాఫ్ హుస్సేన్ నియామకం నేడు బాధ్యతల స్వీకరణ

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 25)**



జిల్లా కేంద్రమైన మార్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్గా ఎస్ కె అల్తాఫ్ హుస్సేన్ నియమితులయ్యారు. ఈ మేరకు డిఐజి కార్యాలయం నుండి అధికారికంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈయన గతంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పెద్ద దోర్నాల, అర్ధవీడు, రాచర్ల , పొదిలి, నాగులుప్పలపాడు, ఒంగోలు తాలూకా ప్రాంతాల్లో ఎస్ఐగా పని చేశారు. ఎస్ఐ నుండి సీఐగా పదోన్నతి పొందిన ఈయన నెల్లూరు జిల్లాలో కొంత కాలం పని చేశారు. ఇది ఇలా ఉండగా ఇప్పటివరకు సీఐగా పని చేసిన పి సుబ్బారావు ఒంగోలులోని ఎస్పీ కార్యాలయానికి వీఆర్కు వెళ్లిన విషయం తెలిసిందే. సీఐగా నియమితులైన ఎస్ కె అల్తాఫ్ హుస్సేన్ ఆదివారం ఉదయం మార్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టనున్నారు.

# రాజసానికి, పౌరుషానికి మారుపేరు ఒంగోలు గిత్తలు

### మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)**



రాజసానికి, పౌరుషానికి మారుపేరుగా నిలిచి భారతదేశ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిచెప్పిన ఒంగోలు జాతి గిత్తలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గర్వకారణమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మద్దిరాలపాడు లో జరిగిన జాతీయస్థాయి ఒంగోలు జాతి బల ప్రదర్శన ఎడ్ల పోటీలకు మంత్రి స్వామి శనివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రాంతంలో పుట్టిన ఒంగోలు జాతి గిత్తలు మనదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మేలు జాతిగా గుర్తింపు పొంది మన ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిందన్నారు. ఒంగోలు జాతి జాతీయస్థాయి ఎడ్ల పోటీలు మద్దిరాలపాడులో నిర్వహించడం అభినందనీయమన్నారు. బల ప్రదర్శనలను నిర్వహించడం ద్వారా ఒంగోలు జాతి పశువులను పశుపోషకులు ఉత్సాహంగా పశుసంపదను పెంచుతారన్నారు. ఇది కేవలం బల ప్రదర్శన కాదని ఒంగోలు జాతి పశు సంపదకు ప్రోత్సాహకమని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో పోతినేని శ్రీనివాసరావు (పియస్ఆర్) (తరువాయి 4లో...)




## పీసీ పల్లి పంచాయతీ ప్రత్యేక అధికారి కేతు వేణుగోపాల్‌రెడ్డికి ప్రశంస పత్రం



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఏప్రిల్ 25)**

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజబాబు చేతుల మీదుగా పీసీ పల్లి మండల పరిధిలో "స్వామిత్వ, ఇంటి పన్నులు, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో" ప్రత్యేక సేవలందించినందుకు, పీసీపల్లి ఉప మండల అభివృద్ధి అధికారి, పీసీ పల్లి పంచాయతీ ప్రత్యేక అధికారి కేతు వేణుగోపాల్‌రెడ్డికి ప్రశంస పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘీక, సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీవాసులురెడ్డి, కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి యన్ విజయ్ కుమార్ తదితరులు ప్రశంసించారు.

## మలేరియా రహిత సమాజాని కై అందరూ కృషి చేయాలి




**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 25)**

మలేరియా రహిత సమాజాన్ని స్థాపించేందుకు ఆరోగ్య సిబ్బంది, ప్రజలు సమైఖ్యంగా కృషి చెయ్యాలని వైద్యాధికారి డాక్టర్ పి సాయి శ్రీ చరణ్ అన్నారు. శనివారం మండలంలోని చిన్నగంజాం ఆరోగ్య కేంద్రం నందు డాక్టర్ పి సాయి శ్రీ చరణ్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు డాక్టర్ మాట్లాడుతూ మలేరియా రహిత సమాజ స్థాపనకి ప్రతి పౌరుడు కృషి చేయాలని కోరారు. మలేరియా రహితసమాజాన్ని "ఇప్పుడు మనం సాధించగలం, ఇప్పుడు మనం తప్పక సాధించాలి" అనే నినాదాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ సంవత్సరానికి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రేరణ తో ఆరోగ్య సిబ్బంది ఉత్సహంగా పనిచెయ్యాలని, ప్రజలు తమ నివాస పరిసరాలలో మంచినీరు, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమలు ఇంటి పరిసరాల్లోకి పుట్టకుండా,కుట్టకుండ చూసుకోవాలని, చలి, జ్వరం, వాంతులు, తలనొప్పి, కీళ్ళ నొప్పులు, లాంటి లక్షణాలు కనిపిస్తే ఆశ కార్యకర్తలు,హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎం, సిహెచ్ఓలతో రక్త పరీక్షలు చేయించుకోని కోరారు.మలేరియా అని ఉందో లేదో నిర్ధారణ చేసుకోని,మలేరియా ప్రభలకుండా మందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని పొడి చెత్త, తడి చెత్త వేరు చేసి పారేయాలనీ, ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రై డే గా పాటించాలని తెలిపారు. ఈ మలేరియా అవగాహన ర్యాలీ లో చీరాల సబ్ యూనిట్ ఆఫీసర్ పి శ్రీనివాసరావు, హెచ్‌వి ఉల్దరాణి, హెల్త్ సూపర్వైజర్ చిరంజీవి, హెల్త్ అసిస్టెంట్ మురళి, ఏఎన్ఎం స్టాలినీ, దేవిలు, సిహెచ్ఓ రమాదేవి, ఆశాలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో ఈసిసిఈ కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 25)**

మండలంలోని కోత్తపాలెం పంచాయతీ రామచంద్రనగర్ అంగన్వాడీ కేంద్రంలో శనివారం సూపర్వైజర్ సుమలత ఆధ్వర్యంలో ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సుమలత మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు ఆటలు, పాటలు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. పిల్లలలో ఉత్సాహం నింపడానికి, తెలివితేటలు మెరుగుపడే విధంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రతినెల చివరి వారంలో డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.పిల్లలకు ప్రోత్సాహకరంగా ఉండే విధంగా పిల్లల భాషాభివృద్ధికి, శారీరక అభివృద్ధికి, సృజనాత్మకతకు, మేధాభివృదికి, గణితాభివృద్ధికి కార్డులను కూడా ఇస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సుమలత,ఏడబ్ల్యుడబ్ల్యు ఈశ్వరమ్మ,తల్లులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రతిపాదినలు రూపొందించాలి







ఆదేశించారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను కూడా కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. భూగర్భ నీటిమట్టాన్ని పెంచేందుకు జల వనరులను పునరుద్ధరించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఇందులో భాగంగా ' జలధార - జల హారతి ' కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ఉపాధి కూలీలకు పనులు కల్పించడంతోపాటు గ్రామాలలో ఈ దిశగా నీటి లభ్యత పెంపు కోసం ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతున్న తీరును కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్తను ఇంటి వద్దే వేరు చేయాలని ప్రజలకు సూచించారు. గ్రామంలోని ' చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ' పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రజలు కోరగా, స్థానిక లేఅవుట్లో అందుబాటులో ఉన్న స్థలాల గురించి ఆయన ఆరా తీశారు. అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించేలా సత్వర చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. విద్యుత్, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరగా, ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, డ్రైనేజీ మంజూరు చేసామని అధికారులు వివరించారు. త్వరలోనే పనులు చేపడతామన్నారు. పెండింగ్లో ఉన్న ప్రభుత్వ భవనాల నిర్మాణాలు కూడా త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. పులివారిపాలెం గ్రామంలో కూడా కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామంలో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ గ్రామానికి రోడ్డు మరమ్మతుల పైనా దృష్టి పెడతామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికార యంత్రాంగం మొత్తం ప్రజల వద్దకు రావటం ఎంతో హర్షనీయమన్నారు. ప్రజలు కూడా తమ సమస్యలను నేరుగా, స్వేచ్ఛగా ఉన్నతాధికారులకు తెలియ చేయడంతో సత్వర పరిష్కారానికి అవకాశం ఏర్పడిందన్నారు. ఆర్థిక కేటాయింపులతో సంబంధం లేని పనులను వెంటనే పూర్తిచేసేలా అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు, ముఖ్యమంత్రి ఆశయాలకు అనుకూలంగా జిల్లా యంత్రాంగం అడుగులు వేయటం సంతోషకరమన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల ప్రజల్లో కూడా సంతోషం పెరుగుతుందన్నారు. ఈ పర్యటనలో వారి వెంట ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, వివిధ శాఖల జిల్లా, స్థానిక అధికారులు ఉన్నారు.

# రాజసానికి, పౌరుషానికి మారుపేరు ఒంగోలు గిత్తలు



జాతి స్థాయి ఎడ్ల పోటీలకు మొదటి బహుమతిగా బుల్లెట్ బైక్ ఇవ్వడం జరుగుతుంది. అక్కడకు వచ్చిన వారందరిని బుల్లెట్ బైక్ ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్, దగ్గుపాటి వెంకటేశ్వరరావు, దగ్గుపాటి హితేజ్ చెంచురాం, మండవ మురళీకృష్ణ, నిర్వాహకులు గుమ్మడి సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.















# ఘనంగా ముస్లిం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యద్ సాదిక్ పుట్టిన రోజు వేడుకలు

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 25)**

ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ సయ్యద్ సాదిక్ జన్మదిన వేడుకలు మార్కాపురం పట్టణంలో శనివారం జనసైనికులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ ను కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నిరుపేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొదిలి మండల జనసేన పార్టీ నాయకులు షేక్ హల్చల్ జహీర్, నాగార్జున యాదవ్, షేక్ మదర్ వలి, పొదిలి పట్టణ తెలుగు యువత అధ్యక్షులు షేక్ కాలేషా, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో ఆరోగ్యం, ఆనందం, విజయాలతో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. మీరు చేపట్టే ప్రతి కార్యక్రమం విజయవంతం కావాలని కోరుకుంటూ, భవిష్యత్తులో ఇంకా గొప్ప పదవులు, గొప్ప స్థాయికి ఎదగాలని ఆశిస్తున్నామని తెలిపారు.







# దళితులపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీ కి లేదు




**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 25)**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో దళితులపై జరిగిన అరాచకాలను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని, ఇప్పుడు ఆ పార్టీ నేతలు దళిత ప్రేమను ఒలకబోయడం హాస్యాస్పదమని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పళ్ళ మీసాల దాసయ్య విమర్శించారు. ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దాసయ్య మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో దాదాపు 56 వేల మంది దళితులపై దాడులు జరిగాయని, ఇది భారత దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అత్యధికమని పేర్కొన్నారు. అప్పుడు వైసీపీ పార్టీలోని దళిత నేతలు ఎక్కడికి వెళ్లారని, ఎందుకు నోరు విప్పలేదని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. జగన్ హయాంలో హోమ్ మంత్రిగా ఉన్న సుచరిత 'నేను హోమ్ మంత్రిగా ఉండి కూడా ఒక హోమ్ గార్డును మార్చలేని స్థితిలో ఉన్నాను' అని వాపోయారంటే, వైసీపీ ప్రభుత్వంలో దళిత నాయకులకి ఎంతటి ప్రాధాన్యత ఉందో అర్థమవుతుందని ఆయన ఎద్దేవా చేశారు. వినుకొండ వైసీపీలో స్థానిక నాయకత్వం విఫలమవ్వడం వల్లే వైసీపీ నేతలు ఎక్కడి నుంచో ఇతర ప్రాంతాల నాయకులను దిగుమతి చేసుకుని నిరాధారమైన విమర్శలు చేయిస్తున్నారని దాసయ్య మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే అట్టడుగు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని, స్పీకర్‌గా జి.ఎం.సి. బాలయోగి వంటి దళిత నేతలకు అత్యున్నత పదవులను కట్టబెట్టిన ఘనత ఎన్టీఆర్, చంద్రబాబులకే దక్కుతుందని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఇద్దరు దళిత మహిళలను హోమ్ మంత్రులుగా చేసినా, వారికి కనీస అధికారం లేకుండా కేవలం 'రబ్బర్ స్టాంపుల్లా' వాడుకున్నారని ఆయన ఆరోపించారు. కానీ కూటమి ప్రభుత్వంలో అనిత గారికి పూర్తి స్వేచ్ఛతో పనిచేసే అవకాశం కల్పించారని పేర్కొన్నారు. కరోనా సమయంలో మాస్కులు అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను వీధికుక్కలా ఈడ్చుకెళ్లి ఆయన మృతికి కారణమైన ఘటన, మాజీ న్యాయమూర్తులను, అనిత వంటి మహిళలను వేధించిన తీరు వైసీపీ అరాచక పాలనకు పరాకాష్ట అని దాసయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో పవన్ కుమార్, గుంటూరు జిల్లాలో కిరణ్ బాబు వంటి వారికి శిరోముండనం చేయించి అవమానించిన చరిత్ర వైసీపీదని, అటువంటి వారు ఇప్పుడు దళితుల హక్కుల గురించి మాట్లాడటం సిగ్గుచేటని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రజలు వైసీపీ అరాచకాలను గుర్తించి ఇప్పటికే తగిన బుద్ధి చెప్పారని, ఇప్పటికైనా నిరాధారమైన ఆరోపణలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొమ్ముతోటి పాల్, షనోము, పూండ్ల నరసింహారావు, నాసరయ్య, రాంబాబు, బర్మా, ప్రసాదు, కాలింగ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఏప్రిల్ 25)**
కనిగిరి పట్టణంలో ఇటీవల నూతనంగా నిర్మిచిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని శనివారం కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు, శ్రీశైలం దేవస్థానం కమిటి సభ్యులు దేవకీ వెంకటేశ్వర్లు మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావుని అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటి అధ్యక్షులు దేవకీ శ్రీను, దేవకీ సుబ్రహ్మణ్యం, బి రమేష్, అద్దంకి సుబ్రహ్మణ్యం, జి కొండయ్య, మాజీ కౌన్సిలర్ షేక్ ఫయాజ్, చింతం శ్రీను, కె ఆంజనేయులు, బొట్టు శ్రీను, వెంగళరావు, పి ఫణి, కటకం లచ్చుసు, జయరాం, జగదీష్, ప్రతాప్, మార్తల రాము, మస్తాన్ వలి, జి రాము, షేక్ రహిమాన్, పి తరుణ్, మోహిత్, సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, యాళ్ల కృష్ణారెడ్డి, కె సుబ్బారెడ్డి, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా అంతం-మనతోనే సాధ్యం



**(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఏప్రిల్ 25)**
మలేరియా అంతం మనతోనే సాధ్యమని తొట్టిగారి పల్లె వైద్యాధికారి రాజేష్ కుమార్ అన్నారు. బద్వేల్ మండలంలోని, తొట్టిగారి పల్లెలో, శనివారం ఉదయం ప్రపంచ మలేరియా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మలేరియా అంతం మనతోనే సాధ్యమని, బ్యానర్ చేతపట్టి, పలు వీధులలో ర్యాలీ నిర్వహించారు. లార్వాదశలోనే దోమలను అరికట్టాలని, దోమల నివారణకు దోమతెరలే శ్రేయస్కరమని, పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవాలంటూ, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దోమ ద్వారానే చికెన్ గున్యా, మలేరియా, డెంగ్యూ, మెదడువాపు వ్యాధి, బోధకాలు పలు రకాల వ్యాధులు వస్తాయన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ మాట్లాడుతూ, సిబ్బందిచే తాము ఇంటింటి లార్వా, ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. లార్వా ఉన్నచోట నీటిని పడవేస్తున్నామన్నారు .డ్రైనేజీ కాలువలో, నిల్వ ఉన్న నీరు, తడి ప్రదేశాలలో అబేట్ , ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ ను చల్లిస్తున్నామన్నారు. అవసరమైన చోట మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. 104, విలేజ్ హెల్త్ క్లినిక్ లలో ప్రజల వద్దకే వైద్యం అందుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మందులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ చంద్రావతి ,హెల్త్ అసిస్టెంట్లు వీరి జనార్దన్ రావు, శ్రీరామయ్య, వెంకటసుబ్బయ్య, వైద్య సిబ్బంది మహేంద్ర, సుబ్బరాయుడు, ఈశ్వరమ్మ, ఏఎన్ఎం ,ఆశాలు పాల్గొన్నారు.

## వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి



**(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, ఏప్రిల్ 25)**
వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా నూజెండ్ల మండల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసు కోవాలని ఐనవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దీపికా మంజూష శనివారం తెలిపారు. ఎండాకాలంలో వడదెబ్బ కి గురికాకుండా చిన్నారులు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగిలితే జ్వరం, తల నొప్పి, వాంతులు కావడం, తల తిరగడం, అలసట, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని చల్లటి ప్రదేశంలోకి తీసుకువచ్చి తడి గుడ్డతో తుడవాలి. చల్లని మజ్జిగ, కొబ్బరినీళ్లు, బార్లీనీళ్లు, సబ్జానీళ్లు, నిమ్మరసం వంటి ద్రావణాలు తాగించాలి. వడదెబ్బకు సంబంధించి సందేహాలు ఉంటే ఆశ వర్కర్, ఏఎన్ఎంలకు తెలియజేయాలని మంజూష తెలిపారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని మలేరియా వ్యాధిని అరికట్టాలి

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 25)**
పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని మలేరియా వ్యాధిని అరికట్టాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత పిలుపు నిచ్చారు. శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం నుండి కంభం సెంటర్ వరకు వైద్యఆరోగ్య శాఖ సిబ్బందితో నిర్వ హించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ మలేరియావ్యాధి అరి కట్టడానికి 2008 సంవత్సరం నుండి ప్రపంచ మలేరియా దినముగాప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పారు. మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించ డానికి ఈసంవత్సరం మలేరియా అంతం మన పంతం అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించ డానికి ర్యాలీలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె చెప్పారు. మలేరియా వ్యాధిచాలా ప్రాణాం తకమైన వ్యాధని వ్యాధిబారిన పడ కుండా దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అని ఆమె చెప్పారు. గ్రామాల్లో మరియు పట్టణ ప్రాంతాల్లో నీరు నిల్వలులేకుండా పరిసరాలను పరిశు భ్ర తగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. మార్కాపురం జిల్లాలో 60 వేల మందికి మలేరియా పరీక్షలు చేపట్టడం జరిగిందని ఎవ్వరికి కూడా పాజిటివ్ రాలేదని ఆమె చెప్పారు. అనంతరం ఖమ్మం సెంటర్‌లో వైద్యఆరో గ్యశాఖ అధికారులతో సిబ్బందితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి బి మనష్, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ రాహుల్, డాక్టర్ శ్రావణి, డాక్టర్ అనూష, డాక్టర్ చేతన్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# లాడ్జిలపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు

### అసాంఘిక కార్యకలాపాలకు తావిస్తే కఠిన చర్యలు తప్పవు గ్రామీణ ఎస్ఐ వేమన హెచ్చరిక



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 25)**
మార్కాపురం జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం పలు లాడ్జిలపై గ్రామీణ ఎస్ఐ వేమన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అసాంఘిక కార్యకలాపాలను అరికట్టే లక్ష్యంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లాడ్జిలలోని అతిథుల రిజిస్టర్‌లు, రికార్డులను ఎస్ఐ క్షుణ్ణంగా పరిశీలించారు. రూములు తీసుకునే వారి పూర్తి వివరాలు, ఆధార్ కార్డులు, చిరునామా ధృవీకరణ వంటి అంశాలను ప్రత్యేకంగా తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సరైన వివరాలు నమోదు చేయకుండా గదులు ఇవ్వకూడదని లాడ్జి నిర్వాహకులకు స్పష్టం చేశారు. అనంతరం ఎస్ఐ వేమన మాట్లాడుతూ లాడ్జిలను అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మార్చే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే పట్టణం మరియు మండల పరిధిలో మఫ్టీలలో ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తున్నాయని తెలిపారు. ప్రజలు కూడా అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ ఆకస్మిక తనిఖీలతో లాడ్జి నిర్వాహకుల్లో అప్రమత్తత పెరిగింది. పోలీసులు ఇలాంటి తనిఖీలు మరింత విస్తృతంగా కొనసాగిస్తారని సమాచారం.

## నేడు పట్టణంలో 5 కే రన్

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 25)**
స్వీయ జనగణన ప్రచారం పై ఆదివారం ఉదయం 7 గంటలకు 5 కే రన్ జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ 5కే రన్ సప్తగిరి లాడ్జి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు జరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో పాటు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

## మాజీ సైనిక ఉద్యోగులకు లీగల్ ఎయిడ్ క్లినిక్

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)**
మాజీ సైనిక ఉద్యోగులకు సుప్రీంకోర్టు వారి ఆదేశాల ప్రకారం వీర్ పరివార్ సహాయ యోజనలో భాగంగా లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. శనివారం లీగల్ ఎయిడ్ క్లినిక్ అని సందర్శించిన న్యాయమూర్తి అక్కడ నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ న్యాయస్థానలు కల్పించిన ఈ అవకాశం మాజీ సైనిక్ ఉద్యోగులు అంతా ఉపయోగించుకొని తమయొక్క కుటుంబపరమైన ఆర్థికపరమైన మొదలైన న్యాయ పరమైన సమస్యలు పరిష్కారం పొందవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ధనలక్ష్మి, న్యాయ సేవ సహాయకులు శ్రీనివాసరావు కార్యాలయం పర్యవేక్షణ అధికారి పద్మజ సిబ్బంది సుధాకర్ పాల్గొన్నారు.


## ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సమయంలో మార్పులు

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)** ఒంగోలు కలెక్టరేట్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పీజీఆర్ఎస్) సమయంలో మార్పులు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కాలం ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఈ నెల 27వ తేదీ (సోమవారం) కలెక్టరేట్లో జరగబోవు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలోని ప్రజలు మార్పును గమనించాలని కోరారు. ప్రజలు నిర్దేశించిన సమయానికి కార్యక్రమానికి చేరుకొని వారి వారి సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందజేయాలని సూచించారు.

## వైసీపీ నుండి దేవినేని కృష్ణ బాబు సస్పెండ్


Yuvajana Sramika Rythu Congress Party

తాడేపల్లి
ఏప్రిల్ 25, 2026

పత్రికా ప్రకటన

పార్టీ అధ్యక్షులు శ్రీ వై.యస్. జగన్ మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు, బాపట్ల జిల్లా, అద్దంకి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బల్లికురవ మండల పార్టీ అధ్యక్షులు శ్రీ దేవినేని కృష్ణ బాబు గారిని పార్టీ నుండి సస్పెండ్ చేయడమైనది.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో క్రమశిక్షణా కమిటీ సిఫార్సు మేరకు పార్టీ అధ్యక్షుల వారు ఈ నిర్ణయం తీసుకోవడమైనది.

- పార్టీ కేంద్ర కార్యాలయం

#47, Bharatha Matha Road, Tadepalli, Guntur District, Andhra Pradesh – 522501.
Phone: 08645 295551, Fax: 08645 295553, www.ysrcongress.com, Email ID: centralofficeysrcp@gmail.com

**(షణ్ముఖ వెలుగు, బల్లికురవ, ఏప్రిల్ 25)** వైయస్సార్ పార్టీ మండల అధ్యక్షులు దేవినేని కృష్ణబాబును వైయస్సార్ పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ తాడేపల్లి కేంద్రం పార్టీ కార్యాలయం నుండి శనివారం ప్రకటన విడుదల చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా క్రమశిక్షణ కమిటీ సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటనలో తెలిపారు. ఎవరైనా పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇటీవల కాలంలో దేవినేని కృష్ణబాబు మండల కన్వీనర్ గా తొలగిస్తున్నారంటూ వైసిపి ఇంచార్జ్ డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రెస్ మీట్ పెట్టి మరి మాట్లాడిన సంగతి తెలిసిందే. దీంతో ప్రధానంగా బలహీనంగా ఉన్న కొన్ని మండలాలలో కూడా మండల పార్టీ అధ్యక్షులను మార్చవచ్చని ఆ పార్టీ కార్యకర్తలు అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ మేధా సంపత్తి దినోత్సవం



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 25)** మండల కేంద్రమైన ఉలవపాడు జీవీఎస్ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జివిఎల్ సుధారాణి అధ్యక్షతన వాణిజ్య శాస్త్ర విభాగం వారి ఆధ్వర్యంలో ప్రపంచం మేధా సంపత్తి దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విద్యార్థులకు నూతన ఆలోచనలు, ఆవిష్కరణలు వాటి ప్రాముఖ్యత, మేధో సంపత్తి చౌర్యం గురించి రక్షణ పొందే మార్గాలను వివరించడం జరిగింది. వాణిజ్యశాస్త్ర అధ్యాపకురాలు ఎస్ హరిత ప్రపంచ మేధా సంపత్తి దినోత్సవం ఆవిర్భావం గురించి, ప్రస్తుతం పోటీ ప్రపంచంలో మేధాసంపత్తి హక్కులైనా పేటెంట్లు, ట్రేడ్ మార్కులు,కాపీ రైట్లు, లోగో, డిజైన్, బ్రాండింగ్ ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయని ప్రతి ఒక్కరు నూతన ఆవిష్కరణల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించవచ్చు అని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి సుజాత, విద్యార్థులకు మేధా సంపత్తి హక్కులు ప్రస్తుత ప్రపంచంలో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# బ్లాక్ స్పాట్స్ వద్ద ఏర్పాటు చేసిన కుంభాకార దర్పణాలను గమనించి, ప్రయాణిద్దాం ప్రమాదాలను నివారిద్దాం



**జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు**

**వాహన చోదకుల భద్రత ప్రకాశం, మార్కాపురం పోలీసుశాఖల బాధ్యత**

**వాహన చోదకుల సహకారమే ప్రమాదాల నివారణకు మూలం**

**ప్రమాదాల నివారణకు కలిసికట్టుగా పని చేద్దాం**

**రాబోయే తరాలకు భద్రమైన భవిష్యత్తుకు పునాదులు వేయుదాం**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)** ప్రకాశం, మార్కాపురం జిల్లాలలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రాధాన్యతనిస్తూ, బ్లాక్ స్పాట్‌లు, ఆక్సిడెంట్ జరగటానికి అవకాశము ఉన్న ప్రదేశాలలో 115 ప్రదేశాలను గుర్తించడం జరిగిందని, ఆ ప్రదేశాలలో వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని కుంభాకార దర్పణాలు ఏర్పాటు చేయడం ద్వారా ముందస్తు హెచ్చరికలు అందేలా చర్యలు చేపట్టినట్లు ప్రకాశం, మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రయాణించే వాహనదారులు బ్లాక్ స్పాట్స్ వద్ద మరింత అప్రమత్తంగా ఉండి, కుంభాకార దర్పణాల సహాయంతో ఎదురుగా వచ్చే వాహనాలను ముందుగానే గుర్తించి జాగ్రత్తగా వాహనాన్ని నడపాలని సూచించారు. అలా గుర్తించడం ద్వారా యాక్సిడెంట్ జరిగే అవకాశం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండదని వాహన చోదకులకు జిల్లా ఎస్పీ గారు మనవి చేయడమైనది. సైన్‌బోర్డులపై ఉన్న హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు దారితీసి కుటుంబాలకు అపార నష్టం కలిగిస్తుందని, ప్రతి వాహనదారు బాధ్యతతో వ్యవహరించడం అత్యంత అవసరమని ఎస్పీ అన్నారు. బ్లాక్ స్పాట్స్ వద్ద కుంభాకార దర్పణాలను గమనించడం ద్వారా డ్రైవర్లు తక్షణమే అప్రమత్తమై ప్రమాదాలను నివారించగలరని తెలిపారు. ఒక్క ప్రాణం కూడా వాహనం నడుపుతున్న సమయంలో పోగొడదనే దృఢ సంకల్పంతో పోలీసుశాఖ వారు యాక్సిడెంట్స్ నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుంది. ప్రకాశం, మార్కాపురం జిల్లా పోలీసుశాఖ చేపడుతున్న ఈ రోడ్డు భద్రత చర్యల్లో ప్రతి వాహనదారు భాగస్వామిగా మారి, ప్రమాదాల నివారణకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. వాహనదారులు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు.









# బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో విస్తృత తనిఖీలు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)** ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఒంగోలు వన్ టౌన్ సిఐ వెంకటేశ్వరరావు, ఒంగోలు టూ టౌన్ సిఐ ఎం. శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, పరిసర ప్రాంతాలలో శనివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో డాగ్ స్క్వాడ్, పేలుడు పదార్థాలు కనుక్కునే జగిలాం చేత బాంబు స్క్వాడ్‌తో పాటు పోలీస్‌లు పాల్గొన్నారు. ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, పార్శిల్ సెంటర్లలో పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలు, ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో అనుమానాస్పద వస్తువులు, అపరిచిత లగేజీలను గుర్తించేందుకు బస్టాండ్ ఆవరణ, పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. అనుమానం కలిగిన ప్రయాణీకుల బ్యాగులను ప్రత్యేకంగా ఓపెన్ చేయించి తనిఖీ చేశారు. అనుమానాస్పద పార్సిళ్లు కనిపించిన వెంటనే లేదా గుర్తించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని, ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పటిష్టమైన భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ తనిఖీలలో ఒంగోలు వన్ టౌన్, టూ టౌన్ సిబ్బంది పాల్గొన్నారు.





# ఉచిత మెగా కంటి వైద్య శిబిరం



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 25)** మండలంలోని అలగాయపాలెం గ్రామంలో శ్రీ మంజునాథ హాచరీస్ ఏవీఎస్ రాజు వారి ఆధ్వర్యంలో సర్వ నేత్రాలయ హాస్పిటల్ వారు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామంలోని ప్రజలు వచ్చి ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరానికి వచ్చిన ప్రజలకు డాక్టర్ మానస పెనుమచ్చ కళ్ళకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ప్రస్తుత వేసవి కాలంలో ఎండ వేడికి ఎలా వుండాలో, ఏమి చెయ్యాలో వివరించారు. శిబిరంలో పాల్గొన్న వారికి కంటి అద్దాలు అవసరమైన వారికి ఉచితంగా అందించారు. శుక్లాలు ఉన్నవారికి సోమవారం ఆపరేషన్ ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు.

## ఎన్టీఆర్ విగ్రహం పక్కన లిక్కర్ వ్యాపారి విగ్రహమా సిగ్గు సిగ్గు..

**మీడియా సమావేశంలో అమ్మనబ్రోలు గ్రామ టిడిపి నేతల వాదన**

**సంపూర్ణ మద్యపానం కోసం పోరాడిన వ్యక్తి ఎన్టీఆర్**

**ఎన్టీఆర్ విగ్రహం పక్కన వీరయ్య చౌదరి విగ్రహం పెట్టకూడదు**

**అభిమానం ఉంటే గ్రామంలో ఎక్కడైనా పెట్టుకోవచ్చు**

**తెలుగుదేశం పార్టీకి చెందిన మమ్మల్ని వైసిపి అనడం సబబు కాదు**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)** స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహం పక్కన వీరయ్య చౌదరి విగ్రహం పెట్టే స్థాయి లేదని, గ్రామంలో ఎక్కడైనా మరో ప్రాంతంలో పెట్టుకోవచ్చని నాగులుప్పలపాడు మండలం, అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన టిడిపిలోని ఒక వర్గం నాయకులు పేర్కొన్నారు. ఒంగోలులోని అంజయ్య రోడ్ లో గల ఓ ప్రైవేటు భవనంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు సింగమనేని సురేష్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి తాము టిడిపిలో కొనసాగుతున్నామన్నారు. ఎన్టీఆర్ అంటే తమకు ఎంతో అభిమానం అన్నారు. అయితే ఈనెల 22వ తేదీన అమ్మనబ్రోలు గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహం పక్కన అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ, లిక్కర్ వ్యాపారస్తులు వీరయ్య చౌదరి విగ్రహం పెట్టేందుకు ప్రయత్నించటం , ఎన్టీఆర్ అభిమానులుగా తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ సంపూర్ణ మద్యపాన నిషేధం కోసం పోరాటం చేసిన వ్యక్తి అని, అటువంటి వ్యక్తి విగ్రహం పక్కన వీరయ్య చౌదరి విగ్రహం పెట్టాలి అనుకోవడం సబబు కాదని, పేర్కొన్నారు. ఈ విషయమై గ్రామ సర్పంచి తోపాటుగా పలువురు సంతకాలు చేసి కలెక్టర్ కి అర్జీ ఇచ్చామన్నారు. అయితే వీరయ్య చౌదరి వర్గం నాయకులు తమను వైసిపి నేతలుగా పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సర్పంచి బత్తుల ప్రవీణ గ్రామంలోని పలు రాజకీయ పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన వ్యక్తి అన్నారు. అటువంటి వ్యక్తి విగ్రహ ఏర్పాటుకు పంచాయతీ అనుమతులతో పాటుగా, ఇటువంటి అనుమతులు ఇప్పటివరకు ఇవ్వలేదని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ప్రథమ పౌరురాలు ఎన్టీఆర్ విగ్రహం పక్కన వీరయ్య చౌదరి విగ్రహాన్ని పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నారంటే గ్రామంలో పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. టిడిపి ఎవరి సొత్తు కాదన్నారు. మొదటి నుండి తాము టిడిపిలోనే కొనసాగుతున్నామన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ కూడా అప్పటి రోజుల్లోని రెండు టిడిపి వర్గాలు తమ గెలుపుకు కృషి చేశాయని, రెండు వర్గాలకు ఉంటుందని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. టిడిపి కార్యాలయం కాంపౌండ్ లోనే లిక్కర్ షాపు కూడా ఉండటం రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా అమ్మనబ్రోలు లో ఉండటం విచిత్రమన్నారు. ఇప్పటికైనా గ్రామంలో వీరయ్య చౌదరి విగ్రహాన్ని ఎన్టీఆర్ విగ్రహం పక్కన కాకుండా ఎక్కడైనా పెట్టుకోవచ్చు అని హితవు పలికారు. ఈ సమావేశంలో అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

# ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేర నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యం






ఇ(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)

మాదక ద్రవ్యాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిని లక్ష్యంగా చేసుకుని ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చీమకుర్తి సీఐ డి.ప్రసాద్, ఒంగోలు సబ్ డివిజన్ 5 మంది ఎస్ఐలు, 40 మంది పోలీస్ సిబ్బంది, ఈగల్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి చీమకుర్తిలోని గరికమిట్ట ప్రాంతంలో, పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 'ఆపరేషన్ వజ్రా ప్రహార్'లో భాగంగా కార్డన్ ఁ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఇళ్లు, దుకాణాలు, పాత ముద్దాయిల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. కొత్త వ్యక్తులు యొక్క వివరాలను సేకరించారు. సరైన పత్రాలు లేని 30 బైక్ లు, 3 ఆటో లు స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు గారు మాట్లాడుతూ ప్రజలు, గ్రానైట్ కార్మికులు గంజాయి సహా అన్ని రకాల మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలకు బానిసైతే వ్యక్తి



ఆర్థికంగా, కుటుంబపరంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వ్యక్తి తన చర్యలపై నియంత్రణ కోల్పోయి అనేక అనర్థాలకు గురయ్యే ప్రమాదం ఉందని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు అక్రమ రవాణా, విక్రయదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం, మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల కాల్స్‌కు స్పందించి ఓటీపీలు చెప్పవద్దని హెచ్చరించారు. అలాగే ఆన్‌లైన్ గేమ్స్,క్రికెట్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని, ఆధార్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తాయని చెప్పే మోసగాళ్లను నమ్మకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, ప్రజలతో కలిసి "మత్తుకు దూరంగా ఉండాలి – మత్తు లేని సమాజాన్ని నిర్మిద్దాం" అనే ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులు లేదా డయల్ 112 లేదా పోలీస్ వాట్సప్ నెంబర్ 9121102266 తెలియజేయాలని ప్రజలను కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమ సమయంలో మార్పులు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 25)

కలెక్టరేట్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పీజీఆర్ఎస్) సమయంలో మార్పులు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కాలంలో రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని ఈ నెల 27వ తేదీ(సోమవారం)న కలెక్టరేట్లో జరగబోవు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మాత్రమే నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలోని ప్రజలు ఈ మార్పును గమనించాలని ఆమె కోరారు. ప్రజలు నిర్దేశించిన సమయానికి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని వారి సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందజేయాలని సూచించారు.

## పూజా కార్యక్రమాలలో పాల్గొన్న హరిబాబు దంపతులు



(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఏప్రిల్ 25)

మండలంలోని అనమనమూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అంకమ్మ తల్లి గుడి, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలలో భాగంగా శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ పూజ కార్యక్రమంలో సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు జంపు హరిబాబు దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రాల నడుమ పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా జంపు హరిబాబు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. అమ్మవారి గుడి, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం లో భక్తులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

## మలేరియా రహిత సమాజం ప్రతి ఒక్కరి బాధ్యత

ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం

జిల్లా మలేరియా అధికారి ఎన్ మధుసూదనరావు






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25):

జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదేశాల ప్రకారం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు మలేరియా వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా రహిత సమాజం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా మలేరియా అధికారి ఎన్ మధుసూదన రావుపేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక వెంకటేశ్వర కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో భాగంగా ఆయన మాట్లాడుతూమలేరియా రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. స్వచ్ఛమైన పరిసరాలు ద్వారా ప్రజలు కీటక జనత వ్యాధులనుండి రక్షించుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని కొనసాగించవచ్చు అని పేర్కొన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేయించుకోవడం ద్వారాను దోమ కాటు నుండి రక్షణ కోసం దోమతెరలు వాడడం వంటి నివారణ పద్ధతులు చేపట్టడం ద్వారాను ప్రతి శుక్రవారం జరిగే ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం వహించి పాల్గొనడం ద్వారా మలేరియా డెంగ్యూ వంటి కీటక జనిత వ్యాధుల నుండిప్రజలు తమను తాను కాపాడుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ, మానవహారం కార్యక్రమాల్లో ఆరోగ్య సిబ్బందితోపాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఏఎంఒ జె విజయ భాస్కర్, సబ్ యూనిట్ ఆఫీసర్లు ఇండ్ల సాగర్, పాతూరి శ్రీనివాసులు, హెచ్‌వి పద్మావతి, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లతో పాటు ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మోడీకి భజన బృందంగా మారిన చంద్రబాబు, జగన్ చంద్రబాబు ఇది మీకు తగునా?

మోడీ ప్రాపకం కోసం అర్రులు చాస్తున్న చంద్రబాబు

ఏపీసీసీ అధికార ప్రతినిధి షేక్ సైదా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)



మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తునన్న చంద్రబాబు మాటలు చూస్తే చంద్రబాబు మానసిక స్థితి ఏందో అర్థమవుతుందనీ, మోడీ ప్రాపకం కోసం అర్రులు చాస్తున్నరని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా అన్నారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రి, 45 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి జగన్లు మోడీ ప్రాపకం కోసం పోటీ పడటం దుర్మార్గమైన చర్యఒకనాడు దేశ స్థాయిలో చక్రం తిప్పిన చంద్రబాబు. నేడు తనకంటే రాజకీయంగా జూనియర్లు అయిన మోడీ, అమిత్ షా జోడీకి చంద్రబాబు మోకరిల్లడం రాజకీయ దివాలా కొరతనం అని సైదా తీవ్రంగా విమర్శించారు. 2023 మహిళా రిజర్వేషన్ బిల్లుని లోక్సభలో, రాజ్యసభలో ఆమోదం పొంది రాష్ట్రపతి ఆమోదముద్ర వేసి న చట్టాన్ని అమలుచేయాలని కాంగ్రెస్ పార్టీ ఇతర రాజకీయ పార్టీలు కోరుతున్న. తనస్వార్థ రాజకీయం కోసం 131వ రాజకీయ సవరణతో కూడినమహిళారిజర్వేష న్ బిల్లును బిజెపి ప్రవేశపెట్టడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని ఆయన అన్నారు. 2023 వ సంవత్సరంలో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లుని మోడీ ప్రభుత్వం మరల పార్లమెంట్లో ప్రవేశపెట్టడం, చెల్లికి మళ్లీ,మళ్లీ పెళ్లి అన్నచందంగా ఉందనీ, అసెంబ్లీ ప్రత్యేక సమావే శాన్ని ఏర్పాటుచేసి మీకు చేతనైతే! ఏపీకి ప్రత్యేక హోదా, ఉపాధి హామీ పథకం యధావిధిగా కొనసాగింపు. రాష్ట్ర విభజన ద్వారా సంక్రమించిన ఇతర హక్కుల కోసం అసెంబ్లీలో చర్చించి తీర్మానం చేయాలని ఆయన కోరారు,లేనిపక్షంలో మాకు చేతకాదు, అంత ధైర్యం లేదు అని చేతులు ముడుచుకొని కూర్చోండి. ఇప్పటికైనా మీ ఉత్తర కుమార ప్రగల్భాలు మానండని చెప్పారు. ఇక ముందు అయినా ఇలాంటి దిగజారుడు, తనను తాను తగ్గించుకునే మాటలు కాంగ్రెస్ పార్టీని తక్కువ చేసి మాట్లాడి విమర్శించే చర్యలను చంద్రబాబు, కూటమినేతలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.

## 28 నుంచి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 25)

చిన్నగంజాం శాఖా గ్రంథాలయం నందు ఎప్రిల్ 28 నుంచి జూన్ 4వ తేదీ వరకు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు అలహరి లక్ష్మీమోహననరసింహాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు మాట్లాడుతూ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణ శిబిరంలో కథలు వినడం, కథలు చదవడం, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం, స్పోకెన్ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, కంప్యూటర్,యోగ నందు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి వున్న విద్యార్థులు గ్రంథాలయం వద్ద గ్రంథపాలకుడిని సంప్రదించి పేర్లు నమోదు చేసుకొని జ్ఞానాన్ని సమపార్జించుకోవాలన్నారు.

## చీరాలలో ప్రశాంతంగా ముగిసిన పాలిసెట్ పరీక్ష



(షణ్ముఖ వెలుగు, చీరాల, ఏప్రిల్ 25)

పట్టణంలోని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో శనివారం నిర్వహించిన ఏపీ పోలిసెట్--2026 ప్రవేశ పరీక్షలు విజయవంతంగా ముగిసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. పదో తరగతి అర్హతతో పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ డా. కె. జగదీష్ బాబు పేర్కొన్నారు. అభ్యర్థులకు బస్సు సౌకర్యంతో పాటు తాగునీరు, ఇతర అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు డిప్యూటీ డైరెక్టర్ డా కె విజయ భాస్కరరెడ్డి తెలిపారు.

## 28 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

(షణ్ముఖ వెలుగు, సంతమాగులూరు, ఏప్రిల్ 25)

గ్రంథాలయ శాఖ నందు ఈనెల 28వ తేదీ నుండి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని గ్రంధాలయ చైర్మన్ బాదం విజయభాస్కర్ రెడ్డి తెలియజేశారు. 45 రోజులపాటు ఈ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విజ్ఞాన శిబిరం ఉంటుందని చెప్పారు. కావున విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# దేవాంగపురి మోడల్ స్కూల్‌లో
# నూతన భవనాల ప్రారంభం






(షణ్ముఖ వెలుగు, చీరాల, ఏప్రిల్ 25)
దేవాంగపురిలోని శ్రీ శంకరయ్య మండల మోడల్ స్కూల్ పాఠశాలలో నూతన భవనాలను చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా సౌకర్యవంతమైన వాతావరణంలో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలో అవసరమైన తరగతి గదులు, మౌలిక వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉన్నట్లు పేర్కొన్నారు. పేద, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ఉద్దేశమని, ఈ నూతన భవనాలు విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేయాలి

డీఎస్‌బీసీయూ చైర్మన్‌గా మణికంఠకు ఎమ్మెల్యే ఏలూరి సూచన



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఏప్రిల్ 25)
ఉమ్మడి ప్రకాశం జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ (డీఎస్‌బీసీయూ) త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా కుంకలమర్రు గ్రామానికి చెందిన కడియం మణికంఠ నియమితులయ్యారు. నియామకం అనంతరం ఆయన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ మణికంఠ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పశుసంవర్ధక పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. గొర్రెల పెంపకందారుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఏలూరి సూచించారు. మణికంఠ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గొర్రెల పెంపకందారుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని, యూనియన్‌ను బలోపేతం చేసి సభ్యులకు లాభాలు చేకూరేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమల శెట్టి శ్రీహరి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నల్లపునేని రంగయ్య చౌదరి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని మణికంఠకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి




(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 25)
ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన పొన్నలూరులో వైద్య సిబ్బంది శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రాథమిక వైద్యశాల నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. మలేరియా అరికట్టేందుకు దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వైద్య అధికారులు తెలిపారు. తీవ్రమైన జరం చలి తలనొప్పి ఉన్నవారు వెంటనే వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామాలలో మురుగునీరు నిల్వ ఉండకుండా చేయడం ద్వారా దోమలను నివారించవచ్చు అని తెలిపారు. ఎవరికైనా జ్వరం ఉంటే వెంటనే వైద్యశాలకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు మల్లికార్జున, సిహెచ్‌ఓ భాస్కరరావు, హెచ్ ఓ సురేష్, గిరిజ, శ్రీనివాసరావు, సుజాత, ఏఎన్ఎంలు ఎంఎల్ హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## దళితుల గుండెల్లో జగనన్నే శాశ్వత ముఖ్యమంత్రి
## వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కటికల వెంకటరత్నం



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఏప్రిల్ 25)
విజయవాడ తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన 'దళిత గళ సమ్మేళనం' కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కటికల వెంకటరత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన దళిత సోదరులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు.

**గత పాలనలో దళితులకు స్వర్ణయుగం :**
గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో ప్రతి దళిత కుటుంబానికి ఆర్థిక, సామాజిక న్యాయం జరిగిందని కటికల వెంకటరత్నం గుర్తుచేశారు. నాడు-నేడు, అమ్మఒడి వంటి పథకాల ద్వారా దళిత బిడ్డల చదువులకు పెద్దపీట వేశారని, నామినేటెడ్ పదవుల్లో దళితులకు సముచిత స్థానం కల్పించి వారిని రాజకీయంగా ఎదిగేలా చేశారని కొనియాడారు.

**కూటమి ప్రభుత్వంపై ధ్వజం :**
రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు దారుణంగా పెరిగిపోయాయని ఆయన మండిపడ్డారు. దళితులకు రక్షణ కరువైందని, అన్యాయం జరిగిన ప్రతిచోటా వైఎస్సార్‌సీపీ అప్పటికప్పుడు స్పందిస్తూ పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. కూటమి నాయకుల అరాచకాలను సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

**కనిగిరి నియోజకవర్గంలో దళిత ఐక్యత :**
కనిగిరి నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్ సారథ్యంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో దళితులను ఐక్యపరిచే కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని వెంకటరత్నం వెల్లడించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన దద్దాల నారాయణ యాదవ్ నేతృత్వంలో దళిత, వెనుకబడిన వర్గాలన్నీ కలిసికట్టుగా ముందుకు సాగుతున్నాయని, రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**2029లో మళ్ళీ జగనన్నే సీఎం :**
2029 ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. దళితులందరూ ఏకతాటిపైకి వచ్చి జగనన్నకు అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు టీజేఆర్ సుధాకర్ బాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు గాలిమోటు దేవప్రసాద్, రాష్ట్ర స్థాయి ఎస్సీ సెల్ ముఖ్య నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజావేదికలో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే దామచర్ల



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)
ఒంగోలు నగరంలోని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు బికే క్యాంపు కార్యాలయం నందు శనివారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ప్రజలు వెల్లడించిన ప్రతీ సమస్యను అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో వెంటనే చర్చించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.




## గార్ల పేట అంగన్వాడీ కేంద్రంలో రెడీనెస్ మేల విజయవంతం

కొండేపి ప్రాజెక్టు ఐసిడిఎస్ సిడిపిఓ సుశీల దేవి




(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, ఏప్రిల్ 25)
కొండేపి ప్రాజెక్టు కూచిపూడి సెక్టార్ పరిధిలోని గార్లపేట సచివాలయం అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం నాడు స్కూల్ రెడీనెస్ మేళ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. సిడిపిఓ బి సుశీల దేవి కార్యక్రమాన్ని ప్రారంభించారు,ఎలిమెంటరీ స్కూల్ హెచ్ఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 3 నుండి 6 సంవత్సరాల పిల్లలు తమ తల్లిదండ్రులతో కలిసి పాల్గొని, శారీరక, మానసిక, పూర్వ గణిత, భాషా, సామాజిక- భావోద్వేగ వికాసానికి సంబంధించిన స్టాల్స్‌ను వీక్షించారు. తల్లిదండ్రుల సమక్షంలో పిల్లలకు అసెస్‌మెంట్ నిర్వహించి, వారి అభివృద్ధి స్థాయిని తెలియజేశారు. ఇంటి వద్దే లభించే వస్తువులతో పిల్లల అభ్యాసాన్ని కొనసాగించే విధానంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలను పాఠశాలకు సంసిద్ధులను చేయడమే ఈ మేళ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమాన్ని ఐటిసి ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ వై వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. సూపర్వైజర్ ఎస్‌కే రిజ్వాన సమన్వయం చేశారు. ఈ కార్యక్రమానికి సెక్టార్ పరిధిలోని అంగన్వాడి కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గార్లపేట ఓసి సెంటర్‌లోని ఆదిలక్ష్మి సెంటర్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# ఎస్సీ కార్పొరేషన్ భూములు 22(ఏ) నుండి తొలగించి పాస్ పుస్తకాలు ఇవ్వాలి

## లబ్ధిదారులను వేధిస్తున్న తహసీల్దారులు, సబ్ రిజిస్ట్రార్‌లపై చర్య తీసుకోవాలి

## బాపట్ల జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసిన దళిత నాయకులు

**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఏప్రిల్ 25)**

బాపట్ల జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ భూమి కొనుగోలు పథకం కింద ప్రభుత్వం రుణమాఫీ రద్దు చేసిన భూములను 22(ఏ) నుండి తొలగించాలని లబ్ధిదారులను వేధిస్తున్న తహసిల్దార్లు సబ్ రిజిస్ట్రార్లపై చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ను దళిత మహాసభ నాయకులు మాచవరపు జూలియన్ నీలం నాగేంద్రరావు విజ్ఞప్తి చేశారు.



శనివారం బాపట్ల కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ను కలిసి ఎస్సీ కార్పొరేషన్ భూములు ఎస్సీ లబ్ధిదారులకే ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిన ఎస్సీ కార్పొరేషన్ అధికారులు భూములు కొనుగోలు చేసిన వారితో కుమ్మకై ఎస్సీ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేయటం లేదన్నారు. కొంతమందికి రిజిస్ట్రేషన్లు చేసిన కారంచేడు తాసిల్దార్ నాగరాజు లాంటి వారు భూస్వాములతో కుమ్మక్కై బాధితులను సర్వే పేరుతో విఆర్ఓ ఆర్ఐ రిపోర్టుల పేరుతో సంవత్సరముల నుండి బాధితులను వేధిస్తున్నారన్నారు. సర్వేరు వీఆర్వో ఆర్ఐ లను బాధితులకు వ్యతిరేకంగా ప్రభుత్వ జీవోలకు వ్యతిరేకంగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్న భూస్వాములకు అనుకూలంగా రిపోర్టులు ఇవ్వాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు బెదిరిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం 2023 వ సంవత్సరం ఆగస్టు 8న జీవోఎంఎస్ 51 ద్వారా రాష్ట్రంలో ఎస్సీ కార్పొరేషన్ భూమి కొనుగోలు పథకం ద్వారా ఎస్సీలకు కొనిచ్చిన భూములలో రుణాలను రద్దు చేసిందన్నారు. ఎస్సీలు తమ ఆధీనంలో ఉన్న లేక అమ్ముకున్నప్పటికీ ఈ జీవ ప్రకారం అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుచేసి తిరిగి ఎస్సీ బాధితులకు భూములు ఆన్లైన్ చేసి తహసీల్దార్ ద్వారా పాస్ పుస్తకాలు ఇవ్వవలసి ఉందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 51 అమలు చేయమని ఆదేశాలిచ్చి మూడు సంవత్సరములు కావస్తున్న ఎస్సీ కార్పొరేషన్ అధికారులు ఆర్డీవోలు తహసిల్దార్లు భూస్వాములతో కుమ్మక్కై కొర్రీలు వేస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. కొంతమంది ఎస్సీ కార్పొరేషన్ అధికారులు ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను మాయం చేశారన్నారు. మరికొందరు ఫోటో స్టార్ట్ లు ఆఫీసులో పెట్టారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ భూములకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాధ్యత వహించి సబ్ రిజిస్టర్ ఆఫీసులో జరిగిన రిజిస్ట్రేషన్లను 22(ఏ) నుండి తొలగించి ఆన్లైన్ చేయించి తాసిల్దార్ల ద్వారా పాస్ పుస్తకాలు ఇప్పించవలసిన బాధ్యత ఉందన్నారు. కానీ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాపట్ల జిల్లా కలెక్టర్ దగ్గర కారంచేడు భూమి కొనుగోలు పథకానికి సంబంధించిన లబ్ధిదారులకు ఆన్లైన్ చేసి ఆస్పత్కాలు ఇప్పించటానికి కలెక్టర్ దగ్గర నోట్ ఆర్డర్ తీసుకున్నారు. కానీ రెండు నెలలైనా బాపట్ల జిల్లా కలెక్టర్ వద్ద ప్రొసీడింగ్స్ ఫైల్ పై సంతకం తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. కలెక్టర్ ఆమోదించిన భూమి కొనుగోలు పథకం ఫైల్ కు జాయింట్ కలెక్టర్ మరియు జిల్లా కమిటీ వెరిఫికేషన్లు అంటూ కలెక్టర్ నిర్ణయాన్ని కూడా అమలు చేయకుండా అలసత్వం వహిస్తున్నారు. ఇదే విషయాన్ని ఈరోజు బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ కు దళిత నాయకులు మాచవరపు జూలియన్ నీలం నాగేంద్రరావు ఫిర్యాదు చేయగా త్వరలోనే ప్రొసీడింగ్స్ ఇస్తామని లబ్ధిదారులకు ఆన్లైన్ చేసి పాస్ పుస్తకాలు ఇప్పిస్తామని కలెక్టర్ తెలిపారు. బాపట్ల జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య కార్యదర్శి కాకుమాను రవి, మేడికొండ మురళి, గొరిముచ్చు ఏలియా తదితరులున్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు






**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 25)**

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు అన్నారు. శనివారం బొల్లాపల్లి ఎంపీడీవో ఆఫీస్ వద్ద ప్రజా దర్బార్ నిర్వహించగా చీఫ్ విప్ జీవి హాజరై ప్రజల నుండి వినతుల స్వీకరించారు. ప్రజా సమస్యలను సత్వర పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహించి నేరుగా సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపటం జరుగుతుందన్నారు. ఐజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదులు నమోదు చేసుకొని నిర్ణీత కాలంలో పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. సమస్యలను ప్రజా దర్బార్ కు తెచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. వినుకొండ నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలశీ గ్రామాల ప్రజల నుండి ప్రజా దర్బార్ కు 87 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదు దారులతో చీఫ్ విప్ జీవి ఆంజనేయులు మాట్లాడి స్వయంగా సమస్యలు తెలుసుకొని సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశించారు.

## వేటపాలెం పంచాయతీకి వాటర్ రిఫ్రిజిరేటర్ బహూకరణ



**(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, ఏప్రిల్ 25)**

వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు వేటపాలెం గ్రామపంచాయతీ కార్యాలయానికి వాటర్ రిఫ్రిజిరేటర్‌ను అందజేశారు. చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. చీరాల నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు, యువ నాయకులు దోగుపర్తి బాలకృష్ణ స్పాన్సర్‌గా వాటర్ ఫ్రిజ్‌ను అందించగా, వేటపాలెం మండలం ఎంపీడీవో రాజేష్ రిఫ్రిజిరేటర్ ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, వేసవిలో గ్రామపంచాయతీకి వచ్చే ప్రజలకు చల్లని తాగునీరు అందించడం ఎంతో ఉపయుక్తమని తెలిపారు. సేవా గుణాన్ని చాటుకున్న బాలకృష్ణకు అభినందనలు తెలుపుతున్నట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాసిక వీరభద్రయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు జాగబత్తుని పోతురాజు, వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు పత్తి ముత్తుకమరన్, వాణిజ్య విభాగం మండల అధ్యక్షుడు చుండూరి నాగాంజనేయులు, ఊటికూరి కోటి స్వామి గుప్తా, పాలెం మస్తాన్ తదితరులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలో సత్తా చాటిన గోన ప్రశాంత్ కుమార్




### పలువురి అభినందనలు

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఏప్రిల్ 25)**

కనిగిరి పట్టణంలోని ఎస్సీ కాలనీ ఎంపీపీ పాఠశాలకు చెందిన విద్యార్థి గోన ప్రశాంత్ కుమార్ అద్భుత ప్రతిభ కనబరిచారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మోడల్ స్కూల్ ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలో ప్రశాంత్ కుమార్ 81 మార్కులు సాధించరు, చింతగుంట్ల నిర్మల 81 మార్కుల తో ఇరువురు స్కూల్ ఫస్ట్ (పాఠశాల స్థాయిలో మొదటి స్థానం) నిలిచారు. తద్వారా మోడల్ స్కూల్‌లో సీటు సంపాదించి అర్హత సాధించారు. ఈ విజయంపై పాఠశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాలకొండరెడ్డి మాట్లాడుతూ కష్టపడి చదివితే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించగలరని ప్రశాంత్ నిరూపించాడని కొనియాడారు. ప్రశాంత్ కుమార్‌ను హెడ్మాస్టర్ యం మాలకొండయ్య తో పాటు ఉపాధ్యాయునిలు రానులు, విజయలక్ష్మి, సుజాత, షర్మిల, స్వప్న, పలువురు విద్యా కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. ఉన్నత లక్ష్యాలతో చదువుకుని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. ప్రశాంత్ కుమార్ విజయం పట్ల అతని తల్లిదండ్రులు మరియు స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## వడదెబ్బ నివారణ పై అవగాహన కలిగి ఉండాలి



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 25)**

వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు అవగాహన కల్గివుండాలని సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె కీర్తి సరోజ్ అన్నారు. శనివారం మండలంలోని సంతరావూరు గ్రామంలో డాక్టర్ కె. కీర్తి సరోజ్ అధ్వర్యంలో వడదెబ్బ పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. కీర్తి సరోజ్ మాట్లాడుతూ వాతావరణ మార్పుల ప్రభావంతో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయిున, ఈ క్రమంలో ప్రతిఒక్కరూ తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు పాటించాలని పిలుపునిచ్చారు. మధ్యాహ్న సమయంలో వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలని, ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే తలకు ఎండ తగలకుండా టోపీ,గోడుగు వినియోగించాలన్నారు. ఎండ సమయాల్లో సాధ్యమైనంత వరకు ప్రయాణాలు పెట్టుకోకూడదని, నీడ ప్రదేశాలలోనే ఉండాలని సూచించారు. ఎక్కువ మోతాదులో మంచినీరు, ద్రవ పదార్థాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# డీజిల్ బంద్... పెట్రోల్ నిల్...!

## పెట్రోల్, డీజిల్ లేకపోవడంతో వెను తిరుగుతున్న వాహనాలు

**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఏప్రిల్ 25)**

యర్రగొండపాలెం మండలంలో ఇంధన కొరత తీవ్ర సమస్యగా మారింది. యర్రగొండపాలెంలోని పలు పెట్రోల్ బంకులో డీజిల్, పెట్రోల్ నిల్వలు పూర్తిగా ఖాళీ కావడంతో బంకును తాత్కాలికంగా మూసివేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం నుంచే ఇంధనం కోసం బంకుకు వచ్చిన ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు తిరిగి వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా అత్యవసర పనుల కోసం బయలుదేరిన వారు ఇంధనం దొరకక ఇబ్బందులకు గురయ్యారు. కొంతమంది వాహనదారులు సమీప గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లి ఇంధనం తీసుకురావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంధన సరఫరాలో అంతరాయం కలగడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు బంకు నిర్వాహకులు తెలిపారు. సరఫరా త్వరలోనే పునరుద్ధరించబడుతుందని, ఒకటి రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. ఇంధనం అందుబాటులో లేకపోవడంతో రవాణా సేవలపై కూడా ప్రభావం పడింది. ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లు తమ సేవలను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది. విద్యార్థులు, ఉద్యోగులు తమ గమ్యస్థానాలకు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంధన సరఫరాను సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్య త్వరగా పరిష్కరించకపోతే రవాణా వ్యవస్థ పూర్తిగా స్థంభించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.








## వైభవంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన వేడుకలు






**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఏప్రిల్ 25)**
స్థానిక తర్లుపాడు గ్రామంలో వెలసిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో అలంకరించిన వేదికపై స్వామివారు, అమ్మవార్ల కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తులుభారీగాతరలివచ్చారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ వేడుక భక్తులకు కనువిందు చేసింది. కళ్యాణం అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాదకార్యక్రమంనిర్వహించారు. గ్రామం మరియు చుట్టుపక్కల ప్రాంతాల నుండి వచ్చిన వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాన్నిస్వీకరించారు.సాయంత్రం వేళ విగ్రహ మూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. అలంకరించిన వాహనంపై స్వామివారిని ఊరేగిస్తూ గ్రామ వీధుల గుండా ఊరేగింపు సాగింది. భక్తులు అడుగడుగునా హారతులు ఇచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

## చిలకలూరిపేటలో శంకర నేత్రాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచన







**(షణ్ముఖ వెలుగు, చిలకలూరిపేట, ఏప్రిల్ 25)**
పట్టణంలో శ్రీ శంకర నేత్రాలయం, ఆప్టికల్స్‌ను చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు లు ప్రారంభించారు. అనంతరం వారు నేత్రాలయంలో ఏర్పాటు చేసిన ఆధునిక పరికరాలు, కంటి పరీక్షా సదుపాయాలను పరిశీలించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అందిస్తున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అక్కడే కంటి పరీక్ష చేయించుకున్నారు. ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఆనందదాయకమని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించాల్సిన అవసరం ఉందని సూచించారు. నిర్వాహకులు శివ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరికరాలతో కంటి పరీక్షలు, నాణ్యమైన కళ్లద్దాలు అందించే సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల వారికి సేవలు అందించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేలు పత్తిపాటి పుల్లారావు, ఏలూరి సాంబశివరావులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన కందుల వసంతలక్ష్మి









**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 25)**
సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం మండలం, పట్టణంలోని లబ్ధిదారులకు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచనల మేరకు ఎమ్మెల్యే సతీమణి కందుల వసంతలక్ష్మి లబ్ధిదారుల గృహాల వద్దకు వెళ్ళి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మీకు ఎప్పుడూ అంటగా ఉంటుందన్నారు. ఏ కష్టం వచ్చినా తెలియజేయాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని వారిని ఆప్యాయంగా పలకరించారు. సీఎం సహాయనిధి చెక్కులు అందుకున్న వారిలో షేక్ మస్తాన్ బి రూ.31,500, షేక్ మస్తాన్ వలి రూ.19,101, వడ్డేపల్లి వెంకటరమణ రూ.36,006, షేక్ హబీబ్ రూ.32,255, షేక్ యస్దాని రూ.20,000, బొక్కిసం రవి కిరణ్ (ఆముదాలపల్లి) రూ.41,870, పొదిలి వెంకటస్వామి (అన్నవరం) రూ.39,500, కోవెలకుంట్ల పెద్ద బాల గురవయ్య (కంభాలపాడు) రూ.43,727, గోన అచ్చమ్మ (జువ్వలేరు) రూ.35,000 మొత్తంగా రూ.2,98,959ల చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, మర్రిపూడి ఎంపిపి వాకా వెంకట్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మీగడ ఓబుల్‌రెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, పొదిలి ఏఎంసి డైరక్టర్ సోమిశెట్టి శ్రీదేవి, పొదిలి పట్టణ తెలుగు యువత అధ్యక్షులు షేక్ కాలేషా, ఖాదర్, రబ్బాని, జమీర్, రమేష్, మహబూబ్‌బాష, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అమ్మవారిశాలలో ప్రత్యేక పూజలు**

ఆర్యవైశ్యుల పిలుపు మేరకు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మి పొదిలి పట్టణంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక వాసవీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం ఆమెకు పట్టు వస్త్రాలు సమర్పించి ఘనంగా సత్కరించారు.









## శ్రీ హర్షిణి మహిళా ఇంజినీరింగ్, టెక్నాలజీ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)**
శ్రీ హర్షిణి మహిళా ఇంజినీరింగ్ , టెక్నాలజీ కళాశాల, యేడుగుండ్లపాడు ప్రాంగణంలో నేడు ఉచిత కంటి వైద్య పరీక్షా శిబిరం ఘనంగా నిర్వహించబడింది. మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ రామలింగారెడ్డి ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యేడుగుండ్లపాడు గ్రామస్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తగిన వైద్య సూచనలు అందించారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్, సెక్రటరీ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, డైరెక్టర్ గోరంట్ల హర్షిత్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శ్రీనివాసరావు, డాక్టర్ కె సుధీర్ చక్రవర్తి, హాస్పిటల్ ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, ముఖ్యంగా కంటి ఆరోగ్యం అత్యంత ప్రాముఖ్యమైనదని, ఇలాంటి వైద్య శిబిరాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ఈ శిబిరంలో కళాశాల బోధనా, బోధనేతర సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు. విద్యార్థులతో పాటు యేడుగుండ్లపాడు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన మాక్సివిజన్ వైద్య బృందానికి కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేసింది.







## పంటలు పండించాలనే అంశం పై రెండో రోజు శిక్షణ



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 25)**
స్థానిక మండల వ్యవసాయ కార్యాలయం వద్ద శనివారం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా వివిధ పంటలు పండించాలనే అంశం పై రెండోవరోజు శిక్షణ భాగంగా శనివారం కూడా శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వి. రాము మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ సాగు చేసే విదంగా శిక్షణ కార్యక్రమం ఉపయోగ పడుతుంది అని తెలిపారు.ఎల్ నినో ప్రభావం వలన రాబోయే రోజుల్లో హాఫ్ మూన్ పద్ధతిలో మరియు డ్రాట్ ప్రూఫ్ విధానంలో పంటలు ఏవిధంగా వేసుకొని మంచి దిగుబడులు సాధించాలో వివరించారు. ప్రైమూన్సూన్ డ్రై సోయింగ్ విధానంలో 365 రోజులు పంటలు వేసుకొని భూసారాన్ని పెంపొందించుకొని, అధిక దిగుబడులు పొందవచ్చు అని తెలిపారు. కంది పంటలో అంతర పంటలు, మిరప పంటలో అంతర పంటలు ఏమేమి వేసుకోవాలి, మిరపలో త్రిప్స్ నివారణకు ఏమి చేయాలి, గడ్డజాతి( ఉల్లి, కొత్తిమీర, ముల్లంగి) వేసుకోవాలన్నారు. 365 రోజులు నేలపై పంటలు ఉండేవిధంగా వ్యవసాయ ఉద్యాన సహాయకులకు మండల వ్యవసాయ అధికారి వి రాము తెలియజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ బి ఎస్తేరు రాణి, ప్రకృతి వ్యవసాయ ఫార్మర్ ట్రైనీ డి మందాకిని, వ్యవసాయ విస్తరణ అధికారి ఇ. సుధీర్ కుమార్, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.